



వర్షంలోనే ధాన్యాన్ని రక్షించుకుంటున్న అన్నదాతలు

నిలదీసి.. నిగ్గదీసి..



బియ్యం నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు

- కాకినాడ పోర్టులో రేషన్ మాఫియాపై పవన్ శివాలు
- యథేచ్ఛగా బియ్యం తరలిపోతుంటే అంతా ఏం చేస్తున్నారంటూ నిప్పులు
- డీఎస్‌వో, కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, పోర్టు అధికారులపై తీవ్ర ఆగ్రహం
- తానొచ్చినప్పుడల్లా జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లడమేంటని మండిపాటు
- ప్రతిసారి ఎమ్మెల్యేలు, మంత్రులువస్తేగానీ బియ్యం అక్రమ రవాణా ఆగదా అని నిప్పులు
- పవన్ ప్రశ్నలు, నిలదీతలతో హడలిపోయిన అధికారులు.. బియ్యం మాఫియాకు షాక్
- అటు సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా సాహసించి తొమ్మిది నాటికల్ మైళ్ల ప్రయాణం
- రెండు నెలలుగా తనను తనిఖీలకు రాకుండా అడ్డుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు
- పశ్చిమ ఆఫ్రికాకు వెళ్లే నౌకను సీజ్ చేయాలని ఆదేశాలు : ఎస్పీకి నోటీసులు

మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్. పక్కన మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్



(కాకినాడ/కలెక్టరేట్ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్న వైనంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు పద్ధతి మార్చుకోకుండా మాఫియాకు సహకరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోయేలా అధికారులే సహకరిస్తున్నారంటూ శివాలెత్తారు. డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారులను పిలిచి ఏం చేస్తున్నారు మీరంతా అంటూ మండిపడ్డారు. కాకినాడ జిల్లా ఎస్పీకి ఎన్నిసార్లు చెప్పినా కనీసం స్పందన లేదని దుమ్మెత్తారు. తాను జిల్లాకు ఎప్పుడు వచ్చినా సెలవుపై ఉంటున్నారు.. అంటూ ఆయనకు నోటీసులు పంపాలని ఆదేశించారు. కాకినాడ పోర్టు ప్రమాదకరంగా మారిందని, దీనిపై ప్రధాని, కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తానని హెచ్చరించారు.

యాంకరేజ్ పోర్టులో బియ్యం పరిశీలన

కాకినాడ పోర్టులో పవన్‌కళ్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం పర్యటించారు. తొలుత 12.45గంటలకు యాంకరేజ్ పోర్టులో బార్జిలో తనిఖీలు చేశారు. ఇందులో రేషన్ బియ్యం ఎగుమతి అవుతుండడంతో ఇటీవల అధికారులు పట్టుకున్నారు. నేరుగా పవన్ బార్జి ఎక్కి బియ్యం ప్లేటులో వేసి పరిశీలించారు. రేషన్ బియ్యం అనవాళ్లను గుర్తించారు. అక్కడే ఉన్న డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారి, ఇతర అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. రేషన్ మాఫియాకు మీరంతా సహకరించకపోతే ఇలా ఎలా దేశాలు దాటిపోతోందని శివాలెత్తారు. ఉద్యోగాలు చేస్తున్నారా.. మాఫియాకు వంత పాడుతున్నారా? అంటూ మండిపడ్డారు. పక్కనే ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశించి దీనిపై మరింత గట్టి పోరాటం చేయాలని, నెమ్మదిగా ఉండకూడదని పేర్కొన్నారు. అనంతరం అక్కడినుంచి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత డీప్‌వాటర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి టగ్ ఎక్కి సముద్రంలోకి వెళ్లారు.

సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా..

తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో పవన్ సముద్రంలోకి వెళ్తారని అధికారులు అనుకోలేదు. కానీ అనూహ్యంగా ఆయన టగ్ ఎక్కి తొమ్మిది నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పశ్చిమ ఆఫ్రికా నౌక స్టెల్లా ఎల్ పనామా వద్దకు బయలుదేరారు. సముద్రం భయానకంగా ఉండడంతో అధికారులు వద్దని వారించారు. అయినా పవన్ వినలేదు. నౌకవద్దకు వెళ్లిన తర్వాత పైకి ఎక్కి ఎగుమతికి సిద్ధంగా ఉన్న 640 టన్నుల బియ్యాన్ని పరిశీలించాలి. కానీ వాతావరణం బాగోలేదని, నౌకపైకి ఎక్కొద్దని అధికారులు పవన్‌కు తెలిపారు. సముద్ర ప్రయాణం మధ్యలో పవన్ ఎమ్మెల్యే కొండబాబు సమక్షంలో అధికారులపై మండిపడ్డారు. రేషన్ మాఫియాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మొత్తం సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్ అయ్యిందన్నారు. డీఎస్‌ఓ ప్రసాద్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు అధికారి ధర్మ శాస్త్ర, డీఎస్పీ రఘువీర్‌పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా ఎల్ పనామా భారీ నౌకను సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పోర్టులోని రెండు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు నిఘా ఉండాలన్నారు.

కాకినాడలో రేషన్ మాఫియా

మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి డీప్‌వాటర్ పోర్టుకు చేరుకున్న పవన్ విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. రేషన్ మాఫియా కాకినాడలో దారుణంగా ఉందని, తనను నౌక ఎక్కనీయకుండా అధికారులు అడ్డు కున్నారని పేర్కొని సంచలన వ్యాఖ్యలు చేశా రు. రెండు నెలలుగా కాకినాడ పోర్టులో తనిఖీలకు తనను రాకుండా అధికారులు ఏవో సాకులు చెప్పి అడ్డుకుంటున్నారని గుర్తుచేసి బాంబుపేల్చారు. తాను ఢిల్లీ నుంచి అమరావతి వెళ్లాలని, కానీ రేష న్ మాఫియా తీవ్రత నేపథ్యంలో కాకి నాడ పర్యటనకు వచ్చానని తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం పవన్ అమరావతికి బయలుదేరి వెళ్లారు.



బియ్యం పరిశీలిస్తూ..



డీఎస్పీ రఘువీర్‌ని ప్రశ్నిస్తున్న పవన్

గ్రీన్‌ఛానల్ ద్వారా తరలింపు

అంతకుముందు మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత జూన్‌లో కాకినాడలో తనిఖీ చేసినప్పుడు 26వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నామన్నారు. బియ్యం మాఫియా గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లా నుంచి గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసుకుని కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. పీడీఎస్ బి య్యాన్ని అక్రమంగా త రలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ద్వారంపూడి వ్యాపారం చేశారనీ, ఇప్పుడు బినామీలు ఈ దందా చేస్తున్నారని ఆరోపించారు.

రైతుల గుండెల్లో ఫెంగల్ గుబులు



మండపేట:ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో..

- కలవరపెడుతున్న తుఫాన్
- పంట నష్టం రాకుండా చర్యలు

మండపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ అన్నదాతలను కలవరపెడుతోంది. వరి పంటను కాపాడుకునేందుకు వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే వరికోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 29 నుంచి డిసెంబరు 3 వరకు తుఫాన్ ప్రభావం ఉంటుందని అప్పటివరకు రైతులు పంట కోతను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కోత కోసిన రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు, సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు విక్రయించుకునే పనుల్లో ఉన్నారు. ఇక తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కళ్లాల్లో ఉన్న ధాన్యం తుఫాన్ బారిన పడకుండా వానకు తడవకుండా రైతులు జాగ్రత్తలు పడుతున్నారు. ఇప్పటికే రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లో 95 శాతం పైబడి వరికోతలు పూర్తయ్యాయి. డిసెంబరు 15 నాటికల్లా కోనసీమ జిల్లా వ్యాప్తంగా వరికోతలు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క తుఫాన్ కారణంగా వరికోతలు వాయిదా నేపథ్యంలో దాళ్వా వ్యవసాయ పనులు కూడా ఆలస్యం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు

ఇద్దరు కౌన్సిలర్ల నియామకానికి చర్యలు

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అత్యాచార నిరోధక చట్టం ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు నేషనల్ హెల్ప్‌లైన్ ఎగెనెస్ట్ అట్రాసిటీ ఆవిష్కరణ జరిగిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. ఇద్దరు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను కౌన్సిలర్లుగా నియమించేందుకు మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ న్యూఢిల్లీ శాఖ ఆదేశించిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో దళితుల సమస్యలపై అవగాహన ఉన్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. డిసెంబరు 7వ తేదీలోపు సంబంధిత అభ్యర్థులు తమ చిరునామాతో గతంలో పనిచేసిన శాఖ, హోదా పదవీ విరమణ వివరాలతో అమలాపురం నల్లవంతెన సమీపాన ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. అమలాపురంలో నివాసం ఉండే వారికే ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు జ్యోతి లక్ష్మీదేవి తెలిపారు.

చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రుణాలు

19 సంఘాలకు రూ.13.16 కోట్లు మంజూరుకు ఆమోదం

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి రుణ పరపతిని కల్పిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రుణ పరపతితో చేనేత రంగాన్ని లాభదాయకంగా మార్చుకుని జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. జిల్లాలోని 19 చేనేత సహకార సంఘాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా క్యాష్ క్రెడిట్ రుణాల మంజూరు కోరుతూ రూ.13.16 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు కలెక్టర్ మహేష్‌కుమార్ కమిటీ సభ్యుల అనుమతితో ఆమోద ముద్ర వేశారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి చేనేత సహకార సంఘాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చేనేత మగ్గాలకు ఆధునిక సాంకేతికతను జోడించి ఉత్పాదకతను, నాణ్యతతో పాటు సమయాన్ని ఆదా చేసుకునేలా సంగాలకు తోడ్పాటు అందించాలన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నేత కార్మికుల సంక్షేమానికి వివిధ దశల్లో అండగా నిలిచి చేనేత వృత్తిని లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పరంగా భరోసా కల్పించాలన్నారు. జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో 23 చేనేత సహకార సంఘాలు ఉన్నాయని, వీటి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. సంఘాల పెట్టుబడి వ్యయం, నికర లాభం, రాబడి బేరీజు వేస్తూ మార్కెటింగ్ సౌలభ్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునిక అభిరుచులకు అనుగుణంగా చేనేత ఉత్పత్తులు జరగాలన్నారు. ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుల రూపకల్పన చేయాలని ఆ శాఖ అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు కె.పెద్దిరాజు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ, వీవర్స్ సర్వీసెస్ సంఘం విజయవాడ ప్రతినిధి నాగేశ్వరరావు, ఆర్డీడీ బి.ధనుంజయ్, ఆప్కో ప్రతినిధి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల ద్వారా రోజువారీ

కలెక్టర్ మహేష్‌కుమార్

20 వేల మెట్రిక్ టన్నుల తవ్వకాలు జరపాలి

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక రీచ్‌ల ద్వారా రోజువారీ 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కపిలేశ్వరపురం, తాటిపూడి రీచ్‌లలో నీటి ప్రవాహం ఇంకా కొనసాగుతుందని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే నిర్దేశిత ఆపరేటింగ్ ఏజెన్సీల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఒక్కో రీచ్ నుంచి సుమారుగా 500 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేపట్టాలని సూచించారు. నార్కేడుమిల్లి, ఆలమూరు, పొడగట్లపల్లి రీచ్‌లలో డిసెంబరు 1 నుంచి తవ్వకాలను ఆపరేటింగ్ ఏజెన్సీల ద్వారా చేపట్టాలన్నారు. వారు ముందుకు రాని పక్షంలో నోటీసులు జారీ చేయాలన్నారు. రీచ్‌ల నుంచి స్టాక్ యార్డుకు, స్టాక్ యార్డు నుంచి వినియోగదారులకు ఎంత పరిమాణంలో ఇసుక విక్రయించబడుతుందో రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు. భవన నిర్మాణ రంగాలకు అవసరమైన డిమాండుకు అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. కపిలేశ్వరపురం-2 నుంచి స్థానిక వినియోగం కోసం ఎంత పరిమాణంలో ఇసుకను తరలిస్తున్నదీ పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మూడో వ్యక్తికి విక్రయిస్తున్నారేమో గమనించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పట్టా భూముల్లో ఇసుక ఎంత పరిమాణంలో ఉందో అంచనాలు వేసి ఆ మేరకు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లలో తరలించుకునేందుకు అనుమతులను గ్రామస్థాయిలో ఇవ్వాలని సూచించారు. పట్టా భూముల్లో ఇసుక నిల్వలు ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న వారికి జియో కోఆర్డినేట్స్‌తో డీజీపీఎస్ సర్వే, ఎఫ్ఎల్‌సీ సర్వేలను పూర్తిచేసి అనుమతులు ఇచ్చి డిసెంబరు 6వ తేదీ నాటికి పర్యావరణ అనుమతులు జారీ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా గనులు, భూగర్భశాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్డీవోలు అఖిల, కె.మాధవి, పి.శ్రీకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు, జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ బదిలీ

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వి.మదన్మోహనరావును ప్రభుత్వం బదిలీ చేసింది. మంగళగిరిలోని సీసీఎల్ఏ విభాగంలో అసిస్టెంట్ సెక్రటరీ హోదాలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సీ ప్లేన్స్ కార్యకలాపాల నిర్వహణకు

అనువైన ప్రాంతాలను గుర్తించాలి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీప్లేన్స్ కార్యకాలాపాల నిర్వహణకు అనువైన ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీ ప్లేన్స్ కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్‌లైన్స్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సీప్లేన్స్‌కు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సముద్ర పుష్ బ్యాక్ వాటర్ ఎల్లప్పుడూ ఉండే ప్రాంతాలను, నదీ ప్రాంతాలను సీప్లేన్స్ కార్యకలాపాలకు అనువుగా గుర్తించాలన్నారు. సీప్లేన్ ల్యాండింగ్, యాటర్స్ తిరిగేందుకు రన్‌వేకు వీలుగా 1.80 ఎకరాల విస్తీర్ణం గల భూమిని గుర్తించాలని చెప్పారు. నీటి వినియోగదారుల సంఘాల భాగస్వామ్యంతో ఆ పని చేపట్టాలన్నారు. సముద్రతీరం, ఐ.పోలవరం, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఈ తరహా లోకేషన్లు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. నీటిలోతు కనీసం ఆరు అడుగులు ఉండే ప్రాంతాలను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. నివేదికలు అందించిన తరువాత సీ ప్లేన్స్ కార్యకలాపాలు, భౌగోళిక పరిస్థితులు, పర్యావరణంపై పూర్తిస్థాయిలో సాంకేతిక బృందం అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలను నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, ఆర్డీవోలు అఖిల, శ్రీకర్, మాధవి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


స్వచ్ఛమైన సేవలు..

నిశీధిలో.. జీవనయాత్ర!

నగరం నిద్రపోయే వేళ వీరి దినచర్య మొదలు.. రాత్రంతా చెమటోడ్చే శ్రమజీవులు


నిశీధిలో..




చెత్త.. తీసుకెళతాం

కాకినాడ నగరం.. నైట్ విజిట్

రాత్రి 10.. 11.. 12 గంటలకల్లా అంతా ఇళ్లకు చేరిపోతారు. నిశ్చింతగా నిద్రపోతారు. అర్ధరాత్రి గాఢ నిద్రలోకి జారుకుంటారు.. కానీ, నగరం నిద్రపోతున్న వేళ.. వీరంతా మేల్కొంటారు.. నిశ్శబ్దం రాజ్యమేలుతున్న వేళ.. వీరు పనిలో నిమగ్నమై ఉంటారు.. అసలు అర్ధరాత్రి బయటి ప్రపంచం చాలామందికి తెలీదు.. అసలు రాత్రంటే చీకటేనా.. కుక్కల అరుపులు, కప్పల చప్పుళ్లు, దోమపోట్లు.. ఇవేనా? అసలు రాత్రిపూట ఏం జరుగుతోంది.. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు అంతా చీకటేనా..? అంటే అవును చీకటే.. అందరినీ నిద్రపుచ్చే చీకటి.. అందరికీ విశ్రాంతినిచ్చే చీకటి.. కానీ అదే చీకటి కొందరి జీవన యాత్రకు నాంది పలుకుతుంది. వారి జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతోంది. వారిని నిదురకు దూరం చేసి.. మనకి నిద్రపట్టేలా చేస్తూ.. వారి బతుకు బండికి నిశీధిలో.. ఉషోదయం కలిగిస్తోంది. కాకినాడ నగరంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఒక రాత్రంతా ఎలా ఉందో చూద్దాం.. రండి..!!




భానుగుడి జంక్షన్లో..


చలిలో.. వెచ్చటి కబుర్లు


మిడ్ నైట్ ఫుడ్ డెలివరీ


తెలవారక ముందే పేపర్ బాయ్స్..


రైతు బజారులో సందడి..


ఎనీటైం.. పెట్రోల్ బంకు

అందరూ నిద్రపోయే వేళ.. వీరు నిశాచరుల్లా సంచరిస్తారు. కానీ వీరికి ఇప్పుడే జీవన యాత్ర మొదలవుతుంది. అర్ధరాత్రి మొదలై తెల్లవారుజామున ముగిసే పనుల్లో వారంతా బిజీగా ఉంటారు. కొందరు వేకువజామున మొదలై ఉషోద సమయానికి పనులు పూర్తి చేసేస్తారు. 'ఆంధ్రజ్యోతి' అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు విజిట్ చేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కనిపించిన దృశ్యాలను తమ కెమెరాలో బంధించింది. కాకినాడ నగరంలో నాలుగు లక్షల మంది జనాభా ఉన్నారు. వీళ్లంతా పొద్దున్న లేచేసరికి వీధులన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయంటే దానికి కారణం నగరపాలక సంస్థ పరిధిలోని నైట్ శానిటేషన్ వర్కర్స్ ఘనత.. రోజంతా వేసిన చెత్తను రాత్రివేళల్లో 52 మంది పారిశుధ్య కార్మికులు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఊడుస్తున్నారు. వీళ్ల పనితీరు వల్లే నగరం ఉదయానికి పరిశుభ్రంగా.. సుందరంగా ఉంటోంది. అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి వివిధ గ్రామాల్లో పండించిన పంటలను వందలమంది రైతులు కాకినాడ పెద్ద మార్కెట్‌కు తెల్లవారుజామున రెండు, మూడు గంటల నుంచి తీసుకొస్తుంటారు. దీంతో ఆ సమయంలో పెద్ద మార్కెట్ రైతులు, వర్కర్లు, కొనుగోలుదారులతో సందడిగా ఉంది. ఇక నగరంలో ప్రధాన కూడళ్లు సర్పవరం జంక్షన్, భానుగుడి జంక్షన్, త్రీలైట్ జంక్షన్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి ప్రాంతాల్లో ఆరోగ్య మెడికల్స్, అపోలో, కీర్తి, మెడ్‌ప్లస్ సహా మరిన్ని మెడికల్ షాపులు 24/7 సేవలందిస్తున్నాయి. రాత్రిపూట ఎవరికి అత్యవసరంగా మందులు కావాలన్నా వీటిని ఆశ్రయిస్తున్నారు. నగరంలోని గాంధీనగర్‌లో దిగువున ఉన్న నైట్ హోటల్ కాకినాడలో ఎంతో ఫేమస్. రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుంది. రాత్రి వేళల్లో ఇడ్లీ, పూరి, చపాతి, పరోట, ఉప్మా, దోసెలు అందిస్తారు. ఇలా మరికొన్ని హోటళ్లు అర్ధరాత్రి వరకు ఉంటుండగా, తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి చాలా హోటళ్లు తెరచుకుంటున్నాయి. ఇది శీతాకాలం.. చలిలో వేడివేడి టీ తాగితే ఆ మజానే వేరు. కాకినాడ భానుగుడి సెంటర్‌లో తెల్లవారుజామున మూడు గంటల నుంచి చార్మినార్ టీ సెంటర్‌లో టీ దొరుకుతుంది. ఆ సమయంలో అక్కడ ఎంతో రద్దీ కనిపిస్తుంది. రాత్రి సమయాల్లో బయటకి వచ్చి కాసేపు అలా తిరిగి ఐస్‌క్రీమ్ తినే అలవాటు కొందరికి ఉంటుంది. వీరి కోసం నగరంలోని మెయిన్‌రోడ్డు, భానుగుడి సెంటర్, జేఎన్టీయూ, ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ సెంటర్లలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఐస్ క్రీమ్ బళ్లు అందుబాటులో ఉంటున్నాయి. చలికాలంలోనూ వీటి దగ్గర జనం కనిపించడం విశేషం. అరటిపళ్లు అమ్ముకునేవాళ్లు, స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ బాయ్స్ వంటివారు అర్ధరాత్రి 2 గంటల వరకు కనిపిస్తున్నారు. ఈ ఫుడ్ సర్వీసు కంపెనీలు అర్ధరాత్రి దాకా అధిక కమీషన్లు ఇచ్చి సర్వీస్ బాయ్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే పెట్రోల్ బంకుల్లో కార్మికులు, ఆర్టీసీ కార్గో సేవల్లో కార్మికులు, ఆటోడ్రైవర్లు, నైట్ డ్యూటీ పెట్రోలింగ్ పోలీసులు, ఏటీఎంలతోపాటు ఆస్పత్రులు, ప్రధాన కార్యాలయాల వద్ద సెక్యూరిటీ గార్డులు కూడా రాత్రంతా మనకి తారసపడుతుంటారు.


అర్ధరాత్రి అందాల కనువిందు

ప్రజలంతా హాయిగా నిద్రపోతున్న వేళలో నగరం విద్యుత్ కాంతులతో ఎంతో ఆహ్లాదకరంగా.. అందంగా కనిపిస్తుంది. మెయిన్‌రోడ్డు, భానుగుడి జంక్షన్ నుంచి అచ్చంపేట జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపున చెట్లు, డివైడర్ మధ్యలో ఉన్న మొక్కల మధ్య విద్యుద్దీపాలు ఆకట్టుకుంటాయి. చలికాలంలో కావడంతో కొన్నిచోట్ల రాత్రిపూట, తెల్లవారుజాము సమయాల్లో చలిమంటలు కూడా కనిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి/ కాకినాడ కార్పొరేషన్
ఫొటోలు/ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్




అర్ధరాత్రి ఆటో సర్వీస్


నైట్ పెట్రోలింగ్



ఎమర్జెన్సీ సర్వీస్



అన్నవరం నూతన ఈవోగా సుబ్బారావు

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుని ఆలయానికి నూతన ఈవోగా వీర్ల సుబ్బారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దేవదాయ శాఖ అదనపు కమిషనర్‌గా ఉన్న రామచంద్రమోహన్‌ను రెండు రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేసి సింహాచలం ఈవో త్రినాథరావుకు అన్నవరం అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే తాజాగా ఈ ఉత్తర్వులు వెలువడడం విశేషం. సుబ్బారావు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ అన్నవరం ఈవోగా వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే రెవెన్యూ శాఖ నుంచి రిలీవ్ కావడం ఆలస్యమైంది. ప్రభుత్వం 64 మంది డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్ ఉత్తర్వుల్లో అవకాశం దక్కించుకున్నారు. అమావాస్య వెళ్లిన తర్వాత నూతన ఈవో బాధ్యతలు స్వీకరిస్తారని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి.

వనదుర్గ ఆలయంలో చండీ హోమం

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. 11 గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు.

రేపు కాకినాడ సాగర తీరంలో మహా కుంభాభిషేకం



కాకినాడ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వరస్వామి 49వ మహా కుంభాభిషేకాన్ని ఆదివారం కార్తీక అమావ్యాస రోజున నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. రెండు రోజులుగా ఆలయ పరిసర ప్రాంతాలను ముస్తాబు చేయించి మహా శివలింగం ఆకారంలో కోటి శివలింగాలను అమర్చారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు తాతయ్యానాయుడు, తోట పుండరీకాక్షయ్య (బాబి), చిట్నీడి శ్రీనివాస్, గంగాపాత్రుని శ్రీనివాసు మాట్లాడుతూ మహా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టం ఏర్పాటు చేయించామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.


మహా కుంభాభిషేకం వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పంచారామ క్షేత్రాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు


సామర్లకోటలో న్యాయమూర్తి సుజాతకి స్వామి, అమ్మవార్ల చిత్రపటం ఇస్తున్న ఈవో

సామర్లకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి వి.సుజాత కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం కుమార రామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. ఆమెకు ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి పుష్పార్చన జరిపారు. పండితులు ఆమెకు నంది మండపం వద్ద వేదాశీర్వచనం ఇవ్వగా ఈవో నీలకంఠం శేష వస్త్రాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. ధ్వజస్తంభం వద్ద దీపం వెలిగించారు. న్యాయమూర్తి వెంట డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాస్, సీఐ శ్రీకృష్ణభగవాన్, వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, ఆలయ సిబ్బంది వున్నారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం విచ్చేశారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు దర్శనానంతరం బేడా మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

సత్యదేవుని సన్నిధిలో సహస్ర జ్యోతిర్లింగార్చన

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని సన్నిధిలో కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అనివేటి మండపంలో జ్యోతిర్లింగార్చన వైభవంగా జరిగింది. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు శివలింగాకారంలో జ్యోతులను అలంకరించగా రుత్వికులు వెలిగించారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్

విమానాశ్రయ విస్తరణ పనుల్లో పురోగతి

కోరుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయ విస్తరణ పనులు షెడ్యూలుకు అనుగుణంగా పురోగతిలో ఉన్నాయని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నైపుణ్యాభివృద్ధి, ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ శాఖల ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అమరావతి నుంచి విమానాశ్రయ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణకు చెందిన మ్యుటేషన్ పూర్తికాగా ఐదు ఎకరాలకు సంబంధించిన పనులు ఈ వారంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రెండు కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు అనుసంధానం, రహదారి మార్గం కూడా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలో వాటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్, డీజీఎం శ్రీనివాసులు పనుల పురోగతిపై వివరాలు తెలిపారు. రూ.173.28 కోట్లతో చేపట్టనున్న పనుల్లో ఆర్‌బీసీ పనులు 99శాతం పూర్తయ్యాయని, మాన్సన్ పనులు 25శాతం, మాట్రికేషన్ పనులు 20 శాతం పూర్తి చేశామన్నారు. 2025 ఆగస్టు 11 నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.


దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొప్పూరి శివశంకరరెడ్డి -పద్మ దంపతులు రూ.5.01 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో మహిళలు దీపాలంకరణ జరిపారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,03,235 లభించినట్టు ఈవో సూర్యచక్రధరరావు చెప్పారు.

కొంగలు.. కనువిందు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడులో పంట పొలాలు దమ్ము చేస్తున్న వేళ కొంగలు సందడి చేసిన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. -మండపేట

బిక్కవోలులో అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు




పోటీలను ప్రారంభిస్తున్న బిక్కవోలు ఎస్ఐ, ఆడుతున్న శ్రీకాకుళం-పశ్చిమ గోదావరి జట్లు

బిక్కవోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ క్రీడాకారులకు సూచించారు. అంతర జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. బిక్కవోలులో బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహించి ఎంతోమంది జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసి ఉద్యోగావకాశాలు కల్పించిన జాతీయ క్రీడాకారుడు మానుకొండ వీర్రాఘవరెడ్డి సేవలను ఎస్ఐ కొనియాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన బాలికా క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వామి, జిల్లా డీఎస్‌డీవో శేషగిరిరావు, స్టేట్ అబ్జర్వర్ రజనీదేవి, పీడీల అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, పీడీలు బంగార్రాజు, ధనరాజు, యువరాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, అప్పారెడ్డి, ప్రభాకరరెడ్డి, జావేద్, వీకేఆర్ తంబి పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన శ్రీకాకుళం, గుంటూరు జట్లు

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. మొత్తం జట్లను నాలుగు పూల్స్‌గా విడదీయగా శుక్రవారం జరిగి పోటీల్లో పూల్ ఏ నుంచి శ్రీకాకుళం జట్టు పశ్చిమ గోదావరిపై గెలుపొంది సెమీస్‌కు చేరింది. పూల్ సీ నుంచి గుంటూరు జట్టు కర్నూలుపై గెలిచి సెమీస్‌కు చేరుకుంది. వెలుతురు లేమి కారణంగా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ప్రథమ, ద్వితీయ జట్లు పూల్ బిలో విజయనగరం-తూర్పుగోదావరి, పూల్ డిలో విశాఖ-ప్రకాశం జట్ల మధ్య జరగవలసిన సెమీ ఫైనల్ పోటీలు శనివారానికి వాయిదా వేశామని, ఈ పోటీలతో పాటు సెమీస్, ఫైనల్స్ నిర్వహించి పోటీలు ముగిస్తామని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి స్వామి తెలిపారు.

లోడు లారీల బీభత్సం

- బండ రాళ్ల లారీని ఢీకొన్న ఐరన్ లోడు లారీ
- హైవేపై పడ్డ బండరాళ్లు
- నిలిచిన వాహనాల రాకపోకలు
- తప్పిన పెను ప్రమాదం



రాజానగరం-కలవచర్ల జంక్షన్‌లో రోడ్డుపై పడ్డ బండరాళ్లు



ప్రమాద స్థలంలో లారీలు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-కలవచర్ల జంక్షన్‌లో శుక్రవారం రాత్రి గ్రానైట్ బండరాళ్ల లోడుతో వెళ్తున్న లారీని ఐరన్ లోడుతో వస్తున్న మరో లారీ ఢీకొంది. స్థానికుల వివరాలు ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ పోర్టుకు మూడు బండరాళ్లతో వెళ్తున్న ట్రాలీ లారీ మార్గమధ్యలో రాజానగరం హైస్కూల్ సమీపంలో ఏడీబీ రోడ్డు వైపుగా మలుపు తిరుగుతోంది. ఈ సమయంలో వైజాగ్ నుంచి ఐరన్ ఊచల లోడుతో రాజమహేంద్రవరం వైపుగా వస్తున్న లారీ.. బండ రాళ్లతో మలుపు తిరుగుతున్న లారీని ఢీకొంది. దీంతో ట్రాలీపై ఉన్న 3 గ్రానైట్ బండరాళ్లలో 2రాళ్లు హైవేపై పడిపోయి హైవేపై వాహనాలు రాకపోకలు నిలిచి పోయాయి. ఈ ప్రమాదంలో ఐరన్ ఊచల లోడు లారీ డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఆటోలో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాజానగరం ఎస్ఐ నాగార్జున సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో ఏవిధమైన వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకవేళ ఆ బండ రాళ్లు ఏ వాహనం పడినా ఈ పాటికి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితులు ఈ ప్రాంతంలో ఉండేవనే చెప్పాలి.

లారీలతో రహదారులు ఛిద్రం..

నిబంధనలకు విరుద్ధంగా పరిమితి, పరిమాణానికి మించి భారీ బండ రాళ్లతో నిత్యం ఈ మార్గంలో లారీలు వెళ్లడం వల్ల రహదారులు కొంతకాలానికే ఛిద్రంగా మారుతున్నాయి. ఈ భారీ బండ రాళ్ల లారీల తాకిడి వల్లే ఏడీబీ రహదారి దారుణంగా తయారైంది.

జీజీహెచ్‌లో రక్తం గ్రూపు మార్చేసిన వివాదంపై విచారణ

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఒక గ్రూపునకు బదులు మరో గ్రూపు రక్తం ఎక్కించి ఓ మహిళ మృతికి కారణమైన కేసులో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు శుక్రవారం విచారణ ప్రారంభమైంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వలమారు గ్రామానికి చెందిన భావన శిరీష(34) అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈనెల 26న ఆమెకు డయాలసిస్ చేసిన అనం తరం రక్తం ఎక్కించగా అది ఓ-పాజిటివ్ కాకుండా ఏబీ పాజిటివ్ ఎక్కించడంతో ఆ రోగి బిగుసుకుపోయి మృతిచెందిన విష యం తెలిసిందే. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి విచారణ కమిటీని నియమించారు. కమిటీ ఛైర్మన్‌గా మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ రామరాజు, సభ్యులుగా ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సత్యవేణి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ కోనాల అనిత ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ కమిటీ విచారణ చేపట్టింది. ఏఎంసీయు-2లో శిరీష మృతిచెందిన సమయంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది నుంచి కమిటీ వివరాలు సేకరించింది. విచారణ కమిటీ నివేదికను శుక్రవారం రాత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి అందజేసింది.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 30మంది ఎంపిక

పిఠాపురంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు




ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 30మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్చరీ జట్ల ఎంపికకు శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 30మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని, వారు విజయవాడలో డిసెంబరు 3నుంచి 5వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. పోటీల్లో విజేతలు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనవారికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బహుమతులు అందజేశారు. అంతకు ముందు పోటీలను జనసేన నేతలు జోగా వెంకటరమణ, మార్నీడి రంగబాబు, సతీష్ ప్రారంభించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, కె.చిన్నబ్బాయి, బి.కృష్ణార్జున వ్యవహరించారు.

కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ పోటీలు

సెమీస్‌కి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు



కాకినాడ డీఎస్ఏలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం కూడా కొనసాగాయి. మొదటి క్వార్టర్ ఫైనల్ పోటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు అనంతపురం జిల్లా జట్టుపై 8-4 స్కోర్ తేడాతో గెలిచి సెమీస్‌కి చేరినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అదేవిధంగా మరొక క్వార్టర్ ఫైనల్ పోటీలో శ్రీకాకుళం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 11-6 స్కోర్ తేడాతోనూ, విజయనగరం జిల్లా జట్టు గుంటూరు జిల్లా జట్టుపై 3-1స్కోర్ తేడాతో, కడప ప్రకాశం జిల్లా జట్టుపై 10-2 స్కోర్ తేడాతోనూ గెలిచి సెమీస్‌కి చేరాయన్నారు. పోటీలను తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్ బాల్ సంఘ కార్యదర్శి ఏఎన్ రాంప్రసాద్, పరిశీలకులు ఈశ్వరరావు, పీఈటీ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రవిరాజు, నూకరాజు పర్యవేక్షించారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మా సశివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, 21 రకాల ద్రవ్యాలు, 11 రకాల రుద్రాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

నేమాంలో మాక్ డ్రిల్

గెయిల్ ఆధ్వర్యంలో నిర్వహణ



మాక్ డ్రిల్‌లో భాగంగా గ్యాస్ లీకేజీ ఘటనలో అస్వస్థతకు గురైన రైతులను అంబులెన్స్‌లోకి తరలిస్తున్న దృశ్యం



పైపులైన్ నుంచి లీకవుతున్న గ్యాస్‌ని అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సర్పవరం జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీర ప్రాంతం నేమాం జగన్నోహనపురంలో శుక్రవారం గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) సంస్థ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. గెయిల్ సంస్థ జీఎం వై.ఏకుమార్ ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ, వేదాంత, కెయిర్న్స్‌ల సంయుక్త భాగస్వామ్యంలో ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు, జరుగుతున్న సమయం, తర్వాత తీసుకునే నివారణ, సహాయక చర్యలపై సిబ్బంది ప్రదర్శనాత్మకంగా విన్యాసాలు నిర్వహించారు. గ్యాస్ లీకేజీ జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమాచారం, అక్కడ నుంచి విపత్తు నివారణ కోసం పనిచేసే యంత్రాంగం, సిబ్బందికి సమాచారం వెళ్లడం, నివారణ చర్యలను సిబ్బంది విన్యాసం చేసి చూపించారు. ఈ సందర్భంగా జీఎం వైపీ కుమార్ మాట్లాడుతూ గ్యాస్ లీకేజీపై ప్రజలను అప్రమత్తం చేయడం, విపత్తుల నివారణ కోసం పునశ్చరణ కార్యక్రమం ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. నెలకోసారి ఆన్ సైట్‌లో సేఫిటీ భద్రత, ప్రమాదాల నివారణ కోసం తీసుకునే చర్యలపై డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ సర్పంచ్ రాందేవు చిన్న, అగ్నిమాపక కేంద్రం అధికారి టీవీఎస్ రాజేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, ఏడీఎఫ్‌వో సుబ్బారావు, ఎంపీడీపీ పసుపులేటి సతీష్, తహశీల్దార్ వీఎల్ఎన్ కుమారి, ఈవోపీఆర్‌డీ శ్రీరామ ఆంజనేయులు, రిజర్వు డీఎస్పీ తదితరులు పాల్గొనారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి విద్యార్థి మృతి



మరణించిన జ్యోతిప్రకాష్

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా విద్యార్థి ప్రాణం తీసింది. స్థానికుల వివరాల ప్రకారం.. తుర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన గుడిసే మణికంఠ కుమారుడు జ్యోతిప్రకాష్(15) స్థానిక జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులైన జంపెల్లి రాజేశ్(10వ తరగతి), ములపర్తి హేమంత్‌కుమార్(7వ తరగతి), తాడి యువరాజ్(9వ తరగతి)లతో కలిసి శుక్రవారం స్కూల్ మానివేసి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్స్ వద్ద ఉన్న పేరంటాల గుంట చెరువులో సరదగా ఈత కొట్టడానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రకాశ్ ఊబిలో దిగిపోవడంతో స్నేహితులు లాగే ప్రయత్నం చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో అక్కడకు చేరుకున్న స్థానికులు బయటకు తీసుకుని వచ్చి గ్రామంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రకాశ్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్కూల్‌కి వెళ్తున్నానని చెప్పి విగతజీవిగా మారిన కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆటో బోల్తా పడి ఆరుగురికి తీవ్రగాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం



చిన్నింపేట జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ఏలేశ్వరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమకు చెందిన కార్మికులకు తీవ్రగా యాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కార్మికులు ఫ్యాక్టరీ వద్ద తమ సమస్యలపై ధర్నా చేసి అక్కడి నుంచి పెద్దనాపల్లికి గ్రామానికి ఆటోలో బయలుదేరారు. 13మంది ప్రయాణిస్తున్న ఆటో జాతీయ రహదారిపై డివైడర్‌ను బలంగా ఢీకొని బోల్తా పడింది. దీంతో ఆరుగురు మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. కుప్పల దేవి(29), కీర్తి రత్న కుమారిరి (30), కీర్తి నాగమణి(45), బుద్దా రాణి(40), శరకణం భూలక్ష్మి(45),శరకణం జగ్గుబాను(48)కు గాయాలు పాలవ్వడంతో వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

తునిలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



మతిస్థిమితం లేని యువకుడిని తండ్రికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని 25ఏళ్ల వ్యక్తి హల్‌చల్ చేసి భయభ్రాంతులకు గురిచేశాడు. స్టేషన్ మాస్టర్ రూమ్‌లోకి ప్రవేశించడంతో స్టేషన్‌మాస్టర్ పోలీసులకు ఫిర్యాదు అందించారు. దీంతో రైల్వే పోలీసులు ఆ యువకుడి గురించి ఆరా తీశారు. సంబంధిత వ్యక్తి చెన్నై-హౌరా ఎక్స్‌ప్రెస్ నుంచి తునిలో దిగినట్లు కనుగొన్నారు. ఆ యువకుడి పేరు షేక్ రిఫన్‌గా తెలుసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన యువకుడి తల్లిదండ్రులను రప్పించి రిఫన్‌ను అప్పగించారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

రావులపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆటోలో మర్చిపోయిన ఆ డ్రైవర్ నిజాయితీతో పోలీసుల ద్వారా బాధితులకు అందచేసి నిజాయితీ చాటుకున్నాడు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చెందిన మానేపల్లి పుష్పవతి బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఉచ్చిలిలో ఆటో ఎక్కారు. ఆమె రావులపాలెంలో ఆటోలోనే బ్యాగుమర్చిపోయి దిగివెళ్లిపోయారు. అనంతరం ఆటోలో బ్యాగును గుర్తించిన ఆటో డ్రైవర్ మండేలా శివన్నారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అప్పగించి వివరాలు చెప్పాడు. పోలీసులు ఆ బ్యాగును తెరిచి చూడగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెను ఫోన్ ద్వారా స్టేషన్‌కు పిలిపించి సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చంటి సిబ్బంది ఆమెకు బ్యాగును అప్పగించారు. ఆ బంగారు ఆభరణాల విలువ రూ.5లక్షలు ఉంటుందని నిజాయితీతో తన బ్యాగును తిరిగి అప్పగించినందుకు ఆటోడ్రైవర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీని చాటుకున్న శివన్నారాయణను సీఐ శేఖర్‌బాబు అభినందించారు.



రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో బ్యాగును పోలీసుల సమక్షంలో బాధితులకు అందిస్తున్న ఆటోడ్రైవర్

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు

తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇంక్యూబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్



బూట్ క్యాంప్‌నకు హాజరైన శ్రీవాత్సవ్, ప్రముఖులు, పాఠశాలల ఉపాధ్యాయులు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ గ్రామీణ విద్యార్థులకు సృజనాత్మకతతో కొత్త ఆవిష్కరణలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తిరుపతి ఐఐటీలోని టెక్నాలజీ ఇంక్యూబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయూ)లోని ఐసీటీ సౌజన్యంతో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ)బూట్ క్యాంప్ శుక్రవారం ప్రారంభమైంది. జీజీయూ కులపతి కేవీవీ సత్యనారా యణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవసభలో ముఖ్య అతిథిగా హాజరైన శ్రీవాత్సవ్ మాట్లాడుతూ జీజీయూ అనుసంధానంతో విద్య జీఐఎస్ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించేందుకు చేయూతనిస్తా మన్నారు. మరో అతిథి ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్‌సెల్, (ఏఐసీటీఈ) మేనేజర్ ఐఎస్ భీమలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్య దశ నుంచి సృజనాత్మకతను పెం పొందించే దిశగా పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో శిక్షణ జరిపామని, ప్రస్తుతం మూడో దశ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్ నాయర్ మాట్లాడుతూ దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ అందించడం తమ ఫౌండేషన్ ముఖ్యోద్దేశ్యమన్నారు. బూట్ క్యాంప్ నోడల్ అధికారి టి.జయానందకుమార్ మాట్లాడుతూ 2 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, చత్తీష్‌ఘడ్, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 271 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, డైరెక్టర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, దండమూడి విజేంద్రకుమార్, కె.వినోద్‌వర్మ, పాల్గొన్నారు.

ఆలయం... అద్భుతం!

కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరాలయం వద్ద శుక్రవారం రాత్రి ఆలయ శిఖర భాగాన ఉన్న పసిడి కుండలను ముద్దాడేందుకు చందమామ వస్తుందా అనే రీతిలో కనిపించింది. ఈ అద్భుతమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. -సామర్లకోట



బేతేని స్కూల్లో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్

కాట్రేనికోన, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి బేతేని ఇంగ్లీషు మీడియం స్కూల్లో శుక్రవారం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఈవో షేక్ సలీం బాషా హాజరయ్యారు. లయోలా స్కూల్ కరస్పాండెంట్ పాదర్ ఆరోగ్యస్వామి, వీడీఎ చైర్మన్ ఐనుకుపట్ల శ్రీనివాస్, లోకల్ మేనేజర్ సిస్టర్ డేనిమాని పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో ఎందరికో మేలు

మలికిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎందరికో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 36మందికి మంజూరైన రూ.34.60లక్షల చెక్కులను శుక్రవారం అందజేశారు.గుండుబోగుల పెద్దకాపు, తాడి మోహన్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుబ్బల పణి పాల్గొన్నారు.

కళ్లాల్లో ధాన్యం రాశులు.. రైతుల ఆందోళన

● జిల్లాలో 1,57,812ఎకరాల్లో సేద్యం
● 98,400 ఎకరాల్లో కోతలు పూర్తి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు




ముమ్మిడివరంలో కళ్లాల్లో ధాన్యం రాశులు, అంబాజీపేట: కె.పెదపూడిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ముమ్మిడివరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో వీస్తున్న గాలులకు, వర్షానికి ఖరీఫ్ వరి మాసూళ్లకు ఆటంకం ఏర్పడింది. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై గాలులు వీస్తున్నప్పటికీ శుక్రవారం మధ్యాహ్నం నుంచి మాత్రమే వర్షం జల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. యంత్రాలతో వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుంటున్నారు. తుపాన్ దృష్ట్యా వరి మాసూళ్లను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు సూచించినప్పటికీ వాతావరణంలో పెద్దగా మార్పులు లేకపోవడంతో వరి చేలు కోత దశకు చేరుకోవడంతో వీస్తున్న గాలులకు వరి నేలనంటే ప్రమాదం ఉందని రైతులు వరి కోతలు ప్రారంభించారు. ధాన్యం రాశులు ఎక్కడికక్కడే కళ్లాల్లో ఉన్నాయి. జిల్లాలో 1,57,812ఎకరాల్లో వరి సేద్యం కాగా ఇప్పటి వరకు 98,400 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఎక్కువ మంది యంత్రాల ద్వారానే కోతలు పూర్తి చేశారు. వీటికి సంబంధించి 2.46లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా 1.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. మిగతా 1.36లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో రాశుల రూపంలో ఉంది. ఇంకా జిల్లాలో 59,800 ఎకరాల్లో వరి కోత దశకు చేరుకుంది. వరి పంట కోతకు వచ్చే సమయంలో వాతావరణంలో పోటు చేసుకున్న మార్పులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో నాట్లు ఆలస్యంగా వేయడంతో వరి పంట ఆలస్యంగా పంట దశకు వచ్చింది. ఆయా మండలాల పరిధిలో వరి కోతలు పూర్తి కాలేదు. తుపాన్ కారణంగా ప్రస్తుతం వీస్తున్న గాలులు, వర్షాలకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తున్నారు. శుక్రవారం వర్షం ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని బరకాలతో కప్పి వర్షాలకు తడవకుండా నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు.

అన్నదాతల్లో ఆందోళన

అయినవిల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పంటలను ఒబ్బిడి చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసిన పంటలను రోడ్లపైకి చేర్చి రైతులు ఆరబెడుతున్నారు. పంట కోసిన పొలాల్లో పశుగ్రాసాలను ఒబ్బిడి చేసుకు

ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలి

అంబాజీపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు తక్షణమే మిల్లులకు తరలించుకోవాలని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి సూచించారు. గంగలకుర్రులో రహదారి పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని ఆమె ఏవో సీహెచ్.వి విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మండలానికి సంబంధించిన పసుపల్లి మిల్లుకు తరలించుకోవాలన్నారు. అక్కడ కస్టోడియన్ అధికారి ఎప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం పసుపల్లి మిల్లు వద్ద ధాన్యాన్ని పరిశీలించారు. మిల్లులో ఉన్న రికార్డులను పరిశీలించి ధాన్యం పాడవకుండా వెంటనే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తీసుకోవాలన్నారు. రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు.

8,500 మంది వసతిగృహ విద్యార్థులకు బీమా సదుపాయం



వసతిగృహ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 8,500మంది విద్యార్థులకు బీమా సదుపాయం కల్పించినట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులతో పాటు ఆశ్రమ పాఠశాలలు, చిల్డ్రన్ హెల్త్‌కేర్ కేంద్రాల విద్యార్థులు, అనాథాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న 8,500 మంది విద్యార్థులను గుర్తించి ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్సు వర్తింప చేశామన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో వసతిగృహ సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలతో బీమా వర్తింపు ఒప్పందం ప్రక్రియ వివిధ విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రమాదం జరిగిన మొదటి గంటలో (గోల్డెన్ అవర్) అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈపథకాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వసతిగృహాలకు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రులను మ్యాపింగ్ చేయడం ద్వారా తక్షణ వైద్య సేవల కు అవకాశం లభిస్తుందన్నారు. రూ.50వేల వరకు తెలుపు నగదు రహిత వైద్య సేవలు పొందవచ్చునన్నారు. జిల్లాలోని ముమ్మిడివరం, అమలాపురం, రామచంద్రపురం ప్రాంతాల్లోని ఎంప్యానల్ ఆసుపత్రులను వసతిగృహాలకు టైఅప్ చేయడం జరిగిందన్నారు. డిసెంబరు 3 నాటికి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వైద్య సేవలు పొందిన 40 నిమిషాల్లో ఆసుపత్రులకు పేమెంట్ జరుగుతుందని ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధి ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యాయులు సందేహాల నివృత్తి కోసం 1800, 2666 టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, బీసీ సంక్షేమ అధికారి ప్రసాద్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు..

జిల్లాలోని వివిధ మేజర్ డ్రెయిన్ల ముఖ్యంగా మురుగునీటి కారణంగా జలాలు కాలుష్యం కాకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ సైంటిస్ట్ ఆర్.ఎస్.రావు జిల్లాలో నీటి కాలుష్య ప్రమాణాలపై సర్వేకు అనుగుణంగా రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు. జిల్లాలో భూగర్భ జలాలు, వర్షాల కారణంగా నీటి కాలుష్యం పెరుగుతోందని కలెక్టర్ తెలిపారు. కూనవరం, అయినవిల్లి, దేవగుప్తం మేజర్ డ్రెయిన్ల మూలంగా కాలుష్యం వ్యాప్తి చెందుతుందన్నారు. వీటి నివారణకు గుజరాత్ తరహా టెక్నాలజీతో చర్యలు చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు.

వీరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మాసశివరాత్రి సందర్భంగా మురముళ్ళ శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామికి శుక్రవారం లక్షబిల్వ పూజ నిర్వహించారు. ఆలయ పురోహితుడు నాగాబట్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

అయినవిల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తొత్తరమూడిలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి శనివారం లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, రుద్రాభిషేకం, బిల్వపత్రి పూజ, సామూహిక కుంకుమార్చన, సూర్య నమస్కారాలు, లింగార్చన, రుద్రహోమం, శాంతికల్యాణం జరిగాయి. శైవాగమశాస్త్ర ప్రకారం పురోహితులు చంద్రమౌళి నరసింహశర్మ, చంద్రమౌళి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

హోరాహోరీగా అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలో అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు రెండో రోజు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆడబాల విజయ్ శ్రీనివాస్, పట్టణ శ్రీరామచంద్రమూర్తి, ఆనోసి యేషన్ కార్యదర్శి విత్తనాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. రెండో రోజు పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టు శనివారం క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడతాయని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చొల్లంగి ప్రసాద్, కార్యదర్శి వీవీఎస్ఎస్ మూర్తి, జోన్ అధ్యక్షుడు పెన్ సీ రామారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు తోట రవి తెలిపారు. క్వార్టర్ ఫైనల్స్ పోటీల్లో కృష్ణాజిల్లా-అనంతపురం జట్టు మధ్య, తూర్పుగోదావరి-విశాఖపట్నం, చిత్తూరు-శ్రీకాకుళం, పశ్చిమగోదావరి-కర్నూలు జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తారు. అనంతరం సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట రవి, కమిటీ మధుసూదనరావు వెల్లడించారు. విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎస్‌వో పీఎస్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జాతీయ స్థాయిలో పేరొందిన క్రికెట్ వెటరన్ క్రీడాకారుడు మిద్దే ఆదినారాయణ, శ్రీను సోదరులు, ఆకుల చిన్నీలను ఆర్గనైజర్లు, పూర్వ క్రీడాకారులు సత్కరించారు.

వైభవంగా లక్ష రుద్రాక్ష పూజ



లక్ష రుద్రాక్ష పూజలో పాల్గొన్న మంత్రి సుభాష్

అమలాపురంటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రవణంలోనే వేంచేసి ఉన్న శ్రీసర్వమంగళ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 24వలక్ష రుద్రాక్ష పూజా మహోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మాచిరాజు రవికుమార్-నాగవల్లి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దత్త గురుపీఠం వాడ్రేవు శ్రీనివాసరావు పర్యవేక్షణలో అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితుల ఆచార్య బ్రహ్మత్వంలో పంచముఖ శతసహస్ర రుద్రాక్షలను సప్త నదీజలాలతో సంప్రోక్షణ చేశారు. శ్రీరామలింగేశ్వరుని పంచముఖి రుద్రాక్ష పూజ, సర్వమంగళాదేవి అమ్మవారికి శతసహస్ర కుంకుమ పూజలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం లోని ప్రసన్నాంజనేయస్వామికి శతసహస్ర సింధూర నాగవల్లీదళ పూజ, మెట్లగుమ్మపడికి శతసహస్ర గరికపూజ, షిర్డీ సాయినాథునికి శతసహస్ర బిల్వార్చనలు నిర్వహించారు. రూ.40లక్షలతో రాజగోపుర నిర్మాణానికి మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. అనంతరం భక్తులను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, నాయకులు కల్వకొలను తాతాజీ, మట్టపర్తి నాగేంద్ర, జీకే క్రెడిడ పాల్గొన్నారు. ఆలయకమిటీ సభ్యులు యర్రమిల్లి పాండురంగారావు,కె.వెంకటనాగభూషణం, వెత్సా వెంకటరావు సింహాసనారాయణ, జనార్ధన అచ్యుతరావు, కాకి సాయిప్రసాద్, చిక్కం సుబ్బారావు, మాచి రాజు మూర్తి, బి.శ్రీరామమూర్తి, బలర్ సుబ్రహ్మణ్యం, మాచిరాజు సాయికృష్ణశర్మ, గారపాటి వండబాబు పాల్గొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రూ.25కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో 58 అభివృద్ధి పనులు



భూమిపూజ చేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో నాలుగేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడారు. ఎన్నికల కోడ్ రావడంతో 2020డిసెంబర్ 31న సీఎస్ఆర్ కమిటీఆమోదం తెలిపిన పనులు నిలిచిపోయాయన్నారు. అయితే తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండగా తీసుకువచ్చిన పనులు కావడంతో సీఎం ఆమోదంతో భూమి పూజ చేశామన్నారు. రూ.25కోట్ల సీఎస్ఆర్ నిధులతో 58అభివృద్ధి పనులు దశల వారీగా చేపడతామన్నారు. పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ జిందవల్లి రామకృష్ణ, ప్రజాపనులు, మున్సిపల్ శాఖల ఉన్న తాధికారులు, యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఆయా గ్రామాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

మామిడికుదురు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో ఉదయం 12గంటల సమయంలో ఇద్దరు దుండగులు వచ్చి తన మెడలో ఉన్న ఆరు కాసుల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారని వృద్ధురాలు అడబాల శేషకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించి దర్యాప్తును వేగవంతం చేశారు. పెనుగులాట సమయంలో దుండగుల మొబైల్ ఫోన్ సంఘటనా స్థలంలోనే పడిపోవడంతో దానిని స్వాధీనం చేసుకుని కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రాజోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శివకోడు రోడ్డులో చిన్నెద్దు బ్రాందీ షాపు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎం.శ్రీనివాసఫణికుమార్‌పృథ్వీకి గాయాలయ్యాయి. రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు బైపాస్ రోడ్డు దాటుతుండగా ఢీకొనడంతో పృథ్వీకుమార్ తలకు గాయమైంది. స్థానికులు 108లోరాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అమలాపురం కిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

ఉప్పలగుప్తం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చీమనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్లో 450మంది విద్యార్థులకు వైద్యాధికారి లక్ష్మీప్రసన్న పరీక్షలు చేశారు. ప్రధానంగా రక్తహీనత, వినికిడి, కంటిచూపు లోపాలు, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజ్జిరెడ్డి రాయుడు రామకృష్ణమూర్తి, కె.శుభారత్నం, ఎం.తేజ, ఎస్.రమాదేవి, జె.నాగమణి, అనూరాధ, రాజేకుమారి, అరుణ, సత్యవతి, నాగమణి పాల్గొన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

పి.గన్నవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఇ.పెనుమిల్లిలో బెల్టుషాపుపై దాడులు చేసినట్టు కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.శ్యామల తెలిపారు. 22సీసాలు స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేశామన్నారు. ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సత్కారం

అంబాజీపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏకాదశ రుద్రుల యాత్రకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆర్టీసీ డిపో ద్వారా బస్సులు ఏర్పాటుచేసి భక్తులకు దైవదర్శనం కల్పించడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ యర్రంశెట్టి వీరవెంకటనాగకుమార్ అన్నారు. ఏకాదశ రుద్రుల దర్శనానికి వచ్చిన ఆయనకు గంగలకుర్రు అగ్రహారం, ముక్కామల గ్రామంలో ఘన స్వాగతం లభించింది. గ్రామస్తులు పూలమాలతో సత్కరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఏకాదశ రుద్రుల దర్శనం కోసం విశేష స్పందన లభిస్తోందన్నారు. వైజాగ్, ఖమ్మం, మంగళగిరి వంటి ప్రాంతాల నుంచి భక్తులు బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నట్టు తెలిపారు. ఒకే రోజు 11రుద్రుల దర్శనం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. కొవ్వూరు ఆర్టీసీ ఏడీసీ పి.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగుల కార్తీక వనసమారాధన



ఉసిరి వృక్షం వద్ద పూజల్లో పాల్గొన్న డీపీవో శాంతలక్ష్మి, డీఎల్‌పీవో బొజ్జారాజు తదితరులు

అమలాపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిత్యం అలసిపోయే గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కార్తీక వన సమారాధనలో భాగంగా ఆన్నిటినీ మరచిపోయి ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, డీఎల్‌పీవో పి.బొజ్జారాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొంకాపల్లి శ్రీవెత్సవాయ్యకల్లో ఆలయం వద్ద వనసమారాధన జరిగింది. కోనసీమ జిల్లా నలుమూలల నుంచి గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది వందలాది మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు కళాకారులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వివిధ డివిజన్ల డీఎల్‌పీవోలు పి.బొజ్జారాజు, ఎ.రాజు, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదనమోహనరావు, డీఎల్‌డీవో కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి సతీష్‌శ్వేశ్వరరావు, ఎంపీడీవోలు బాబ్జీరాజు, ఈవోపీఆర్డీలు బి.మురళీధర్, జె.మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు. ఆటపాటల అనంతరం కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్యదర్శుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దుర్గారావు, ఎస్ఎస్ నూరుపారాజు, కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిబత్తుల రాజమోహన్, ప్రచార కార్యదర్శి సింగంపల్లి దుర్గాశ్రీనివాస్, కార్యవర్గ ప్రతినిధులు తాడి ఏసు, ఆత్మూరి శరభరాజు, రెడ్డి శిరీష, జి.వాసు, బి.గోవిందు, దారా రామకృష్ణ కృష్ణాజీ, ఏపీఎన్‌జీవో రాజేశ్వరరావు(రాజా), వర్రంశెట్టి ఆదినారాయణ, వర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సైనికుల సంక్షేమానికి విరాళాలు అందించాలి

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సైనికుల సంక్షేమానికి తోడ్పాటును అందించేలా విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయుధ బలగాల పతాక దినోత్సవ ఫండ్ వాల్ పోస్టర్‌ను కల్నల్ కోడ్‌తో ఆయన ఆవిష్కరించారు. డిసెంబరు 7న ఏటా జెండా దినోత్సవాన్ని పాటించాలని నిర్ణయించిందన్నారు. యుద్ధంలో మరణించిన వారికి ప్రభావనం, వారి కుటుంబాలకు సంక్షేమం తదితర విధుల కోసం ఈ విరాళాలను వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి జన్మనక్షత్ర పూజలు

అంతర్వేది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా అష్టోత్తర కలశాభిషేకం, పూజా కార్యక్రమాలు జరిపారు. ముందుగా అర్చకులు బంగారు కలశం కలస్నాపు పవిత్ర ధరించి ఆలయ ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలను అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

గ్రీన్స్ క్లబ్ ఏర్పాటు

మలికిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాలలో శుక్రవారం 1ఎం1వి గ్రీన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 1ఎం1వి స్టేట్ ఇన్‌చార్జ్ సాగర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధి, ఇవేస్ట్ రీసైక్లింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు 1ఎం1వి సంస్థ పనిచేస్తుందన్నారు. దీనిలో భాగంగా వివేకానంద పాఠశాలలో ఎంపికచేసిన విద్యార్థులతో గ్రీన్స్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇ వేస్ట్ ద్వారా రూపొందించిన ప్రాజెక్ట నమూనాను విద్యార్థులకు సాదిక్, రేటీలిన్ వివరించారు. కార్యక్రమంలో సీతాపో వెంకట్, పాఠశాల కరస్పాండెంట్ వీవీవీ వరప్రసాద్, ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, సుబీత, పటికశ్రీ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి

ముమ్మిడివరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి సంబంధించి సకాలంలో పన్నులు వసూలు చేయాలని కమిషనర్ పిరవిద్వర అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పింఛన్ పంపిణీ సిబ్బందితో పన్నుల వసూలు, పింఛన్ పంపిణీపై సమీక్ష నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని వర్కింగ్ ప్రాపర్టీ ట్యాక్సు, వాటరు ట్యాక్సు, ఖాళీ స్థలాలపై పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. కాకినాడ స్మార్ట్ సిటీ మేనేజర్ జి.సాల్మన్‌వర్తి, ముమ్మిడివరం నగరపంచాయతీ మేనేజర్ పీవీ సూకరాజు, ఏఈ పీవీ సుదర్, ఆర్ఐ భాస్కరరావు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

అయినవిల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వీరవల్లిపాలెం గ్రామంలో గల శ్రీసూర్యనారాయణమూర్తి సత్రం వృద్ధాశ్రమ ధర్మకర్త ముద్దగర నాగయ్య కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన, జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంటకోట ఫ్యామిలీ వెంచర్స్ ముద్దగర బీఎస్ సుబ్బారావు, ఎంఎస్ఆర్ వెంకట్రావు, ఎంశ్రీనివాసరావు, ఎంవీఎస్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకోవచ్చు

అంతర్వేది, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో నవంబరు 30వ తేదీనే పెన్షన్ పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు ఎవరైనా రెండు నెలలు తీసుకోలేపోతే మూడో నెల రూ.12వేలు ఒకేసారి తీసుకునేందుకు అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఈ అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, గుబ్బల పణికుమార్, మాకే శ్రీనివాసగణేష్, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, పోతురాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

రాజోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని రాజోలు కొత్తపేట్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్ ఉపాధ్యాయులకు సూచించారు. బి.సావరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు.

మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

అల్లవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు7న మెగా పేరెంట్స్ టీచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంఈవో-2 ఏడుకొండలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఒకే అడుగు నినాదంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అనుబంధాన్ని బలోపేతం చేయడమే పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న మాలల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో డిసెంబరు 14న మాలల ఆత్మీయ సమ్మేళనం జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్టు మాల ముఖ్య నేతల సమావేశం ప్రకటించింది. ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జిల్లాలోని మాల ముఖ్య నేతల సమావేశం శుక్రవారం జంగా బాబూరావు అధ్యక్షతన నిర్వహించారు. డీబీ లోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత డిసెంబరు 7న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని భావించినప్పటికీ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో 14న ఆత్మీయ సమ్మేళనం భారీ స్థాయిలో జరుగుతుందన్నారు. మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జిల్లాలోని మాలలంతా తరలిరావాలన్నారు. నాయకులు ఐనుకుపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, నెల్లి లక్ష్మీపతి, సాపే బాలరవి, కోట రామ్మోహనరావు, వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

ముమ్మిడివరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అనధికారికంగా లేఅవుట్లు వేస్తే ఆ లేఅవుట్ల యజమానులపై మున్సిపాలిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ హెచ్చరించారు. అనధికార లేఅవుట్లలో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేస్తే వాటికి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయమని, ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించమన్నారు.

ఐపీఎల్ ముంబై జట్టుకు ఎంపికపై సంబరాలు

మామిడికుదురు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకటసత్యనారాయణరాజు ముంబై ఐపీఎల్ జట్టుకు ఎంపిక కావడంపై ఆ గ్రామంలో శుక్రవారం సంబరాలు జరిగాయి. గ్రామానికి చెందిన యువకుడు జాతీయస్థాయిలో సత్తాచాటి ముంబై ఐపీఎల్ జట్టుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. మాజీ జడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు సాగినరసింహమూర్తి(బాబు), గెడ్డం సత్యనారాయణ, పాపయ్యరాజు, సతీష్ రాజు, కృష్ణంరాజు, స్థానికులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై పశువైద్యశిబిరాలు

అల్లవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): పశువులకు గర్భకోశ వ్యాధులపై చికిత్సతో పాటు ఉచితంగా ఉన్న పశువులకు కృత్రిమ గర్భధారణ, పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు జిల్లాలోని పశువైద్య శిబిరాల ద్వారా ఇస్తున్నామని జిల్లాపశుసంవర్ధకశాఖ డాక్టర్ కొమ్మ వెంకట్రావు చెప్పారు. సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ మేడిద నారాయణరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కడలి గంగాజలం, డాక్టర్ బోడపాటి, డాక్టర్ శివతేజ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి సారించాలి

పి.గన్నవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు రాజకీయ తలంపు కోసం దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మానేపల్లి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఉద్యోగుల బకాయిలకు రూ.28వేలకోట్లునిధులు కేటాయించలేదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. తర్వాత సంఘ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, వరిగిరి రత్నం, జె.శ్రీనివాస్, జె.ఎస్.సుదర్శిని, జీఎస్ పద్మావతి, బి.బిందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్షంలో హడావిడిగా ధాన్యంలోడు చేస్తున్న హమాలీలు

దడ పుట్టిస్తున్న అల్పపీడనం

● ధాన్యంను ఒబ్బిడి చేసుకునే పనుల్లో రైతులు ● తుఫాన్ ప్రభావంతో వర్షం

● ఇబ్బంది పడ్డ రైతులు ● అధికారుల ఆంక్షలతో నష్టపోయిన రైతులు

కె.గంగవరం, నవంబరు29: బంగాళాఖాతంలో ఏర్పడి తుఫాను కారణంగా మండలంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఇప్పటికే వరి యంత్రాల ద్వారా కోతలు పూర్తిచేసి ధాన్యం తేమ శాతం తగ్గించుకోవడానికి ఆరబెడుతున్న రైతులు తమ పంటను వానభారిన పడకుండా రక్షించుకోవ డానికి అవస్థలు పడ్డారు. బరకాలు, టార్పాలిన్‌లు కప్పిపంటను రక్షించుకున్నారు. హడావిడిగా మిల్లులకు తరలించుకున్నారు.

నష్టపోయిన రైతులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు తమపంటను నచ్చిన మిల్లుకు విక్రయించుకునే విధంగా విధా నాలు రూపకల్పన చేశారు. తొలుత ఈ విధానంలో రైతులకు మేలు జరిగింది. మిల్లర్లు పోటీపడి సీఎంఆర్ విధానంలో ప్రభుత్వ మద్దతు ధరకు మించి కొనుగోలు చేశారు. రైతులు తమకు దగ్గరలో ఉన్న మిల్లుకు ధాన్యం విక్రయించకుని లాభం పొందారు. సాఫీగా జరిగిపోతున్న ఈ విధానంలో గత వారంరోజులుగా అధికారుల అనాలోచిన నిర్ణయాలతో రామచంద్రపురం నియోజకవర్గవంతోపాటు, ప్రక్కనున్న రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోను మిల్లులకు కెపాసిటీస్ పేరుతో టార్గెట్ లేకుండా చేశారు. దీంతో బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి ముందుకు వచ్చిన మిల్లర్లకు అవకాశం లేకుండా చేశారు. మిల్లు చుట్టుప్రక్కల ఉన్న ధాన్యం కూడా ఆ మిల్లుకు తరలించునే అవకాశం లేకుండా చేశారు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో రైతులు ధాన్యంలోడు చేసుకుని రైతు సేవా కేంద్రం వద్దకు వెళితే అక్కడ ఒక్క మిల్లు చూపించని వైనంతో రైతు ఇబ్బందులు పడ్డాడు. ఒక ప్రక్క తుఫాను ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతు గుండెల్లో రైళ్లు పరిగెడు తున్నాయి. అయినా ప్రభుత్వంలో, ప్రభుత్వ అధికా రుల్లో ఈసమంత వెసులుబాటు కలిగించి రైతును ఆదుకోవాలనే ఆలోచన లేకపోవడం ఇక్కడ దారు ణమైన విష యం. ప్రస్తుతం రైతు ధాన్యం విక్ర యించాలంటే ధాన్యంలోడు చేసుకుని రైతు సేవాకేంద్రం వద్దకు వెళ్లి అక్కడ ఏఏ మిల్లులు చూపిస్తున్నాయో వాటికే విక్రయించాలి, ఇటువంటి విధానంలో రైతు ఎక్కడ స్వేచ్ఛగా తనకు నచ్చిన మిల్లులకు విక్రయం చేసుకున్నట్లు అవుతుంది.

గతంలో వెసులుబాటు... ఇప్పుడు ఎందుకు చేయడం లేదు

గతంలో తుఫాన్‌ల సమయంలో ప్రభుత్వం సీఎంఆర్ విధానంలో కొన్ని నిబంధనలు సడలించి రైతులను ఉదారంగా ఆదుకునేది. ఆఫ్‌లైన్ విధానంతో పంటను దగ్గర మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసేది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇటువంటివి చేయకపోవడం ఏమిటని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వ విధానంలో ధాన్యం విక్రయించిన 21రోజులకు ప్రభుత్వం సొమ్ము రైతు ఖాతాల్లో జమ చేసేవారు. ర్యాండమ్ సిస్టమ్‌లో ఏ మిల్లు చూపిస్తే అక్కడకి తరలించేవారు. ఇది రైతులకు ఇబ్బందిగా ఉండేది. కానీ తుఫాన్ల సమయాల్లో ఆఫ్‌లైన్ విధానంలో రైతులు తమ పంటను దగ్గర ఉన్న మిల్లులకు తరలించుకునే అవకాశం ఇచ్చేవారు. మిల్లులకు బ్యాంకు గ్యారంటీలను రెట్టింపుచేసి ధాన్యం కొనిపించేవారు. దీంతో రైతులు తమ పంటలను వేగంగా దగ్గరలో ఉన్నమిల్లులకు తరలించుకుని సేదతీరేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ధాన్యం విక్రయించిన రోజునే సొమ్ము జమచేయడం తప్పితే రైతుకు చేసిన మేలు ఏమీ కనిపించడంలేదు. ఒక ప్రక్క తుఫాను హెచ్చరికలు, మరోప్రక్క పంటను విక్ర యించుకో లేక, దగ్గర ఉన్న మిల్లులకు పంపిచలేక సతమతమవుతున్నాడు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన రైతు ఇక్కడి ఇబ్బందులు గురించి స్వయంగా ఇద్దరు మంత్రులకు వివరించారు. వారు అధికారులను ఆ గ్రామాలకు పంపించారు. రైతు సమస్యలు విన్నారు. వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అన్నీ మామూలే. శుక్రవారం వర్షం వచ్చేసింది. రైతులు పంటలను తడిపేసింది. రైతుల సమస్యలపట్ల కూటమి నాయకులు దృష్టి సారించి అధికారులతో చర్చించి రైతులకు మేలు కలిగించే విధంగా నిర్ణయాలు చేయాలని రైతులు కోరుతున్నారు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

ఆత్రేయపురం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): బం గాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం కారణంగా ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్మేయడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఖరీఫ్ సాగుచేసిన రైతులు పంటలు కోతకు వచ్చిన తరుణంలో తుఫాన్ ప్రభావం రైతుకంటికి కునుకులేకుండా పోతుంది. మాసూళ్లు పూర్తిచేసుకుని వరి యంత్రాలతో కోతలు ప్రారంభించిన రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబోసుకుంటున్నారు. రహదారులను కల్లాలుగా ఏర్పాటుచేసుకుని బిక్కుబిక్కుమంటూ ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో రైతులు కల్లాల్లోనే బరకాలు కప్పుకుని ధాన్యాన్ని రక్షించుకుంటున్నారు. సురక్షిత ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా పండిన పంటను తరలిస్తున్నారు. వరికోతలు వాయిదా వేసుకోవాలని అధికార యంత్రాగం రైతులను హెచ్చరిస్తున్నారు. కొంత మంది రైతులు తేమశాతం ఉన్న మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడంతో మిల్లులకు తరలిస్తున్నారు. ఆకాశం మేఘావృతమై రైతులను కలవరపెడుతుంది. రైతు సేవాకేంద్రాలను తహశీల్దారు రాజేశ్వరరావు సందర్శించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వాతావరణ మార్పులతో..

రావులపాలెం: తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని శుక్రవారం సాయంత్రం ఈదరుగాలులతో కూడిన తేలికపాటి వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రావులపాలెం మండలంలో కొంత మేర వరికోతలు పూర్తి అయ్యినప్పటికి కోయాల్సిన వరి పంటపొలాలు యంత్రాలతో కోసేందుకు సిద్ధమైన తరుణంలో వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో
టీటీడీ ఛైర్మన్ నాయుడు పూజలు



ఆత్రేయపురంలో మొక్కలు నాటుతున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు

ఆత్రేయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు స్వామివారిని దర్శించారు. ఆలయ నిర్మాతలు పాతపాటి నాగరాజు, రామాంజనేయరాజు, రమణరాజు కుటుంబ సభ్యులు ఛైర్మన్ దంపతులకు ఘనస్వాగతం పలికారు. చిన్నారులు పూలవర్షం కురిపించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని స్వామి వారి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హితవు పలికారు. తొలుతగా ఛైర్మన్ నాయుడు దంపతులను టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు.

రాజేష్ వైద్యానికి సాయం



బాధితుడు రాజేష్‌కు సహాయం అందిస్తున్న దృశ్యం

రావులపాలెం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఈతకోటకు చెంది న ఆదిమూలం రాజేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై లివర్‌కు బలమైన గాయమైంది. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం రూ.4లక్షల వరకు ఖర్చువుతుందని వైద్యులు తెలపడంతో దాతల సహాకారం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రావులపాలెం మనం ట్రస్టు ఇన్‌చార్జ్ గంద్రోతు దుర్గాదేవి దాతల సహాకారంతో రూ.35,420 సమకూర్చి పలువురుతో కలిసి సాయాన్ని అందించారు.కార్యక్రమంలో టేకి రామకృష్ణ, గల్లా సత్య ప్రకాష్, సత్యప్రసాద్, పి.శాంత రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడిదలో అగ్నిప్రమాదం

రెండు పూరిళ్లు దగ్ధం
మరో డాబాకు పాక్షిక నష్టం
రూ.7.5లక్షలు మేర ఆస్తినష్టం
రోడ్డున పడ్డ రెండు కుటుంబాలు



ఏడిద దేవుళ్లకాలనీలో శుక్రవారం అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన తాటాకిళ్లు

మండపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రెక్కా డితేకానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన రెండు పూరిళ్ల అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈప్ర మాదంలో రెండు కుటుంబాలకు చెందిన వారు కట్టుబట్టలతో నిరాశ్రులయ్యారు. రెండు తాటాకిళ్లతో పాటు పక్కనే ఉన్న డాబాకి కూడా పాక్షికంగా నష్టం వాటిల్లి రూ.1.5లక్షలు మేర ఆస్తినష్టం జరిగింది. ఈసంఘటనకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండపేట మండలం ఏడిద దేవుళ్లతాళ్ల కాలనీకి చెందిన గెడెల రామలక్ష్మి, పలివెల వరలక్ష్మిలకు చెందిన రెండు తాటాకిళ్ల శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. ఈప్రమాదం ఎందుకు, ఎలా జరిగిందనే దానిపై పలు సందేహాలు వినిపి స్తున్నాయి. రామలక్ష్మి ఇంటిలో పొయ్యిమీద వంట చేసుకుని వెళ్లిన తర్వాత నిప్పురవ్వలులేచి ప్రమాదం జరిగిందా? లేక ఇంటిలో దేవుడికి దీపం వెలిగించినపుడు ఈప్ర మాదం జరిగిందా? లేక విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అనే దానిపై అధికారులు లోతుగా దర్యాప్తు చేసున్నారు. ఇదిలావుంటే ఇరువురు కూడా స్థానికంగా కూలిపనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రామలక్ష్మి ఇంటిలో శుక్రవారం పని ముగించుకుని ఇంటికి తాళంవేసి పనికి వెళ్లింది. అదే సమయంలో రామలక్ష్మి ఇంటిలో అగ్నిప్రమాదం జరగ్గా ఆ ఇంటికి చేర్చివున్న వరలక్ష్మి ఇల్లు కూడా ప్రమాదంలో కాలిబూడిదైంది. ఇద్దరు మహిళలు రెక్కలమీదే ఆధారపడి జీవిస్తుంటారు. ఇటీవలే రామలక్ష్మి రూ.లక్ష వ్యయంతో ఇంటిని నిర్మించుకుంది. ఆమె ఇంటిలోవున్న గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో పేలిపోయింది. పేలిన సిలిండర్ పైభాగం పక్కన దూరంగా ఎగిరి పడింది. రెండో ఇంటిలో వున్న సిలిండర్ కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో నిలువు నీడ లేకుండా రోడ్డున పడ్డారు. బాధితులు తన కళ్ల ముందే కాలిబూడిదైన ఇంటిని సామాన్లను చూసి రోధించిన తీరు అందర్నీ కంటతడి పెట్టించింది. స్థానిక పెద్దలు గ్రామస్థులు తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుల వినతి

దేవుళ్లకాలనీలో జరిగిన అగ్నిప్రమాదంపై గ్రామ సర్పంచ్ బూరిగ అశీర్వాదం విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. బాధితులను అన్నివిధాలుగా అదుకుంటామని ఆయన చెప్పారు. బాధితులకు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్ తన సొంత నిధులు రూ. 5వేలు అందజేశారు.



ఏడిదలో బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని ఏడిద పంచాయతీ పరిధిలో గల దేవుళ్ల కాలనీలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో బాధిత కుటుంబాలను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు జరిగిన నష్టం గురించి ఆయన బాధితులను అడిగి తె లుసుకున్నారు. పక్కనేవున్న ఇళ్లు కూడా కొంతమే ర దెబ్బతిన్న విషయం తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల బాధిత కుటుంబాలకు రూ.5వేలు వంతున రెండు కుటుంబాలకు సాయం అందించారు. స్థానికులు అందించిన రూ.20వేలు ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను అందించారు. బాధిత కుటుంబాలకు బాసటగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన చెప్పారు. ఆయన వెంట మేకా జేజీబాబు, పర్వతీన వీర్రాజు, ముగుళ్ల కాశీకృష్ణ చిట్టుర్రిప్రసాద్, రాజా, శ్రీను వైట్లసాయికిరణ్ ఉన్నారు.

రామచంద్రపురం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరావు



నియామక పత్రం అందుకుంటున్న కోట శ్రీనివాసరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 29 : రామచంద్రపురం నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జిగా కోట శ్రీనివాసరావు నియమితులయ్యారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నియామక ఉత్తర్వులు కోట శ్రీనివాసరావుకు అందజేశారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలోను కాంగ్రెస్‌పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని షర్మిల సూచించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, మాజీ పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

సంఘమేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు

మండపేట, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడిదలో ఉన్న శ్రీసంఘమేశ్వరస్వామివారి ఆలయంలో హుండీ ఆదాయంను శుక్రవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారులు కామేశ్వరరావు, శోభారాణి సారథ్యంలో లెక్కించారు. ఈ యేడాది 11నెలల 15రోజులపాటు వచ్చిన ఆదాయం లెక్కించగా రూ.97వేలు వచ్చిందని వారు తెలిపారు.

నేడు మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సి పల్ సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వున్న కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్‌లు, అంతా తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

వెదురుపాకలో ఘనంగా సాయి సత్యవ్రతాలు



వెదురుపాకలో సాయిబాబా చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాకలో సాయిసత్య వ్రతాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బండారు సుబ్బారావు, చంద్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కందివలసకు చెందిన ఆధ్యాత్మిక గురువు అమ్ముల సాంబశివరావు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగంచేస్తూ ప్రతిఒక్కరూ సంపూర్ణ మానవత్వంలో మనిషిని మనిషిగా ప్రేమించడమే సాయితత్వంగా పేర్కొన్నారు. తొలుతగా సాయిబాబాకి కాకడహారతి, సుప్రభాతము, సాయిబాబాకి భక్తులచే సామూహిక సాయిసత్యవ్రతాలు చేయించారు. భక్తులకు సాయిబాబా, వినాయకుడి పటాలు, విభూది ప్రసాదం అందజేశారు. ఈసందర్భంగా సాయిబాబా చిత్రపటంతో భజనలు, మేళతాళాలతో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయిబాబాకు మధ్యా హ్న హారతి జరిపి భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఈకార్యక్రమంలో కాపవరం గ్రామానికి చెందిన సాయిసేవక్ వి.శ్రీను, బండారు సూరిబాబు, బుల్లిమాంబ, బండారు వెంకటరమ ణ గురుస్వామి, సూర్యకుమారి, సూర్యసాయి మణికంఠ, సాయిరామ్, గ్రామానికి చెందిన అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు బీజేపీ నాయకుల అభినందన



రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన వేగుళ్లను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును గురువారం రాయవరం మండలానికి చెందిన బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు. లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.శ్రీదేవి, చిరట్ల సుబ్బారావు, శాకా దుర్గా శ్రీనివాస్, నిమ్మకాయల సాయిరాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కోళ్లఫారం నిర్మాణం నిలుపుదలకు అధికారుల ఆదేశాలు

మండపేట, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారపూడి కెనాల్‌రోడ్డులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కోళ్లఫారాల షెడ్ల నిర్మాణాలను నిలుపుదల చేయాలని అధికారులు ఆదేశించారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్ల కారణంగా స్థానికంగా ఉండే ప్రజలకు కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే వాటి నిర్మాణ పనులు అడ్డుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించారు.శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారు లు నిర్మాణ ప్రదేశానికి వెళ్లి పనులను నిలుపు దల చేయించారు. కెనాల్‌రోడ్డులో కోళ్లఫారం నిర్మాణ పనులను నిలుపుదలచేసి గ్రామాన్ని కాలుష్యం బారి నుంచికాపాడాలనిస్థానికులు కోరుతున్నారు.

సోమేశ్వరంలో ఘనంగా కార్తీక దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

రాయవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అష్ట సోమేశ్వరాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన మండలంలోని సోమేశ్వరం శ్రీబాలత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని దీపోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పరిటాల సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత సోమేశ్వర స్వామికి, అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన శివస్వాములు, భక్తులు, మహిళలు పాల్గొని దీపోత్సవంలో పాల్గొని దీపారాధనలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా లక్షపత్రిపూజ

కపిలేశ్వరపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కపిలేశ్వరపురంలో ఉన్న శ్రీఅగస్తేశ్వర, పాపవినాసేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, లక్షపత్రిపూజ ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం సందర్భాన్ని పురష్కరించుకుని గ్రామానికి చెందిన పురోహితులు వై.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్షపత్రి పూజా కార్యక్రమంలో వేదపండితులు వై.కిరణ్‌శర్మ, ఆలయ అర్చకులు కాలధరి కృష్ణభగవాన్ పలువురు వేదపండితులు అర్చకత్వంలో పార్వతీసమేత అగస్తేశ్వరస్వామివారికి అభిషేకాలు, విశేషపూజలు, లక్షమారేడు దళాలు, తదితర పూజా కార్యక్రమాలు వేదమంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆల య కార్య నిర్వహణాధికారి, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి హోమం

ఆలమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చరణలతో జరిగిన హోమం కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త గొడవర్తి సత్యనారాయణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధనలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మట్టి శివలింగానికి అభిషేకం

కార్తీకమాసం పర్వదిన సందర్భంగా గోదావరి ఒడ్డున మట్టితో తయారుచేసిన శివలింగానికి వివిధ ద్రవ్యాలతో చేసిన అభిషేకం విశేషంగా ఆకట్టుకుంది. ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద గోదావరి ఒడ్డున పెదపళ్ల గ్రామానికి చెందిన గొడవర్తి శ్రీనివాస్, చరణ్, మడికి మురళీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమాన్ని చింతలూరుకు చెందిన పండితులు నరసింహమూర్తి శాస్త్రోక్తంగా జరిపించారు. పాలు, పెరుగు, పండ్ల రసాలు, తేనె, కొబ్బరినీళ్లు, గోదావరి జలాలతో శివలింగానికి అభిషేకం నిర్వహించి మట్టితో కరిగిపోయిన ద్రవ్యాన్ని గోదావరిలో కలిపారు. ఈకార్యక్రమాలను తిలకించడానికి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఉమాకొప్పేశ్వరస్వామికి లక్ష చామంతి పూజ

కొత్తపేట, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పలివెల ఉమా కొప్పేశ్వరస్వామికి శుక్రవారం భక్తు లు దేవదాయశాఖ ఆధ్వర్యంలో లక్ష చామంతి పూజ, రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో ముత్తైదువులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలతోపాటు దీపాలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లుచేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.





పలివెల ఉమాకొప్పేశ్వరస్వామికి లక్షచామంతి పూజలు దృశ్యం

54 మంది విద్యార్థులకు రక్తహీనత

కె.గంగవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. 254 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా వారిలో 54 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. వీరికి మందులు పంపిణీ చేశారు.

ముగ్గురిపై మద్యం కేసులు

కొత్తపేట/ఆత్రేయపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమ మద్యం నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన నిచ్చన్నకోళ్ళ నాగరాజును పదిలీటర్ల నాటుసారాతో, రావులపాలెంమండలం గోపాలపురం గ్రామానికి చెందిన వ్యక్తిని 12 సీసాల మద్యంతో, పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన వ్యక్తిని 22 మద్యం సీసాలతో అరెస్టుచేసి కేసు నమోదు చేశామన్నారు.